క్లుప్తంగా

కుంగిన కాల్వకు మళ్లీ మరమ్మతులు



కాల్వకు జరుగుతున్న మరమ్మతులు

ఖానాపూర్: నీటి విడుదలతో కుంగిన కాలువకు మరమ్మతులను ఆదివారం సదర్మాట్ జేఈ ఉదయ్ ఆధ్వర్యంలో తిరిగి చేపట్టారు. ఈఈ రామారావు ఆదేశాల మేరకు మరమ్మతులు పూర్తి చేసి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతామని జేఈ పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని.. యాసంగి పంటకు నీరందేలా చర్యలు చేపడుతామని అన్నారు.

కుంటాల వైద్యురాలిగా శృతి



కుంటాల : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యురాలిగా కె.శృతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి పీహెచ్‌సీలో వైద్యురాలిగా పనిచేశారు. ఈసందర్భంగా సిబ్బంది ఆమెను సన్మానించారు.

డీ16 కాలువకు నీటి విడుదల



పొట్టపెల్లి(కె) వద్ద పారుతున్న కాలువ

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని సరస్వతి కాలువకు ఉపకాలువ అయిన డీ16 కాలువకు అధిక మోతాదులో నీరు విడుదల చేయకపోవడంతో మండలంలోని పొట్టపెల్లి(కె), లక్ష్మణచాంద, ధర్మారం, మునిపెల్లి గ్రామాల రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో సాక్షిలో గత నెల 30న డీ16 కాలువకు ఎక్కువ నీటిని విడుదల చేయాలి అనే శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఆదివారం డీ-16 కాలువకు ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేశారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

ఖానాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ నియంత పాలనలో కాంగ్రెస్ నాయకులను కారణం లేకుండా పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ యూత్ అధ్యక్షుడు మడిగెల అనిల్, సుర్జాపూర్ గ్రామ యూత్ అధ్యక్షుడు వంశీని ఆదివారం అరెస్ట్ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు అన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం రాత్రి వైభవంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. మైలారపు భూమన్న కుమారుడు భువర్ధన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా గురుస్వాములు సాయినాథ్, పాపారావు సమక్షంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

కార్యవర్గం

పెంబి: మండల కేంద్రంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు పుప్పాల రాజన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుప్పాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా కన్నె మల్లేష్, కార్యదర్శిగా ఐదు విజేందర్, సహాయ కార్యదర్శిగా బైరి నరేష్, సలహాదారులుగా పుప్పాల నర్సయ్య, గాండ్ల శంకర్, దోనికేని రాజన్న, సుతారి రమేష్, పుప్పాల బాపయ్యను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు. ఇందులో మున్నూరు కాపు మండల సంఘ సభ్యులు ఉన్నారు.

రూ.75 వేల విరాళం



సభ్యులకు విరాళం అందిస్తున్న దాత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎలిశెట్టి లత-శంకర్ దంపతులు రూ.75 వేల విరాళం అందించినట్లు ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షులు ఎలిశెట్టి లింగేశ్వర్ తెలిపారు. ఆరు పిల్లర్ల నిర్మాణానికి విరాళం ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సతీశ్‌రావు, వెంకటేశ్వర్లు, నేత శ్యాం, శ్రీనివాస్, రవికాంత్, భీమేశ్వర్, జనార్థన్, రాజేశ్వర్, చంద్రహాస్, శంకర్, గంగ నర్సయ్య పాల్గొన్నారు.

జీవాలకు మేత కష్టాలు

- గోదావరి ముంపు ప్రాంతంలో నిలిచిన బ్యాక్‌వాటర్
- కరువైన ఖాళీస్థలాలు
- గడ్డిలేక పశువులను అమ్ముకుంటున్న పోషకులు



ఇంటి వద్ద గడ్డిని నిల్వచేసిన రైతు



గడ్‌చాందలో పశువులు

లోకేశ్వరం: వర్షాలతో జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతం(ఎస్సారెస్పీ ముంపునకు గురైన భూములు) నీటితో నిండిపోవడంతో మూగ జీవాలకు గడ్డి దొరకడం లేదు. దీంతో మేతకు వెళ్లిన పశువులు ఖాళీ డొక్కలతోనే ఇంటిబాట పడుతుండడంతో రైతులకు పశుపోషణ తలకు మించిన భారంగా మారుతోంది. కొందరు ఎండుగడ్డిని నిల్వచేసుకోగా మరికొందరు కష్టమైనా తమ పశువులను అమ్ముకుంటున్నారు.

పశుపోషణతోనే జీవనం..

మండలంలోని పలు గ్రామాల్లో పలువురు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. పశువులున్న వారికి సొంతంగా భూములు లేకపోవడంతో ఎస్సారెస్పీ ముంపు ప్రాంతాలకు తోలుకెళ్లేవారు. కాని ప్రస్తుతం సదరు ప్రాంతంలో బ్యాక్‌వాటర్ నిలువడంతో గడ్డి దొరకడం లేదు. జిల్లాలో ఆవులు 1,75,045, గేదెలు 1,18,193, గొర్రెలు 6,43,153, మేకలు 1,02,540 ఉన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

జీవాలకు గడ్డి కరువు..

గోదావరి బ్యాక్‌వాటర్ ఎక్కువగా ఉండడంతో కొందరు రైతులు తమ పశువులను వారి పొలం గట్లపైనే మేపుతున్నారు. కూలీల కొరత కారణంగా వరిపొలాలను కోసేందుకు యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీంతో ఎక్కువ గ్రాసం వృథాగా పోతుంది. పశువులున్న యజమానులు కొద్దో గొప్పో గ్రాసం నిల్వ ఉంచుకుంటున్నారు. భూముల్లేని వారి పశువులకు ముంపు ప్రాంతంలో పెరిగే గడ్డే దిక్కు. ఇప్పుడు పరివాహక ప్రాంతంలో బ్యాక్‌వాటర్ నిలుస్తుండటంతో జీవాలకు గడ్డి కరువు అవుతోంది.

పశుగ్రాసం ధరలకు రెక్కలు..

పశువులపై ఉన్న ప్రేమను చంపుకోలేక కొందరు గడ్డి కొని పోషణ చేపడుతున్నారు. దీంతో గ్రాసం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎడ్లబండి వరిగడ్డి ధర రూ.1500 నుంచి రూ.1800 వరకు, ట్రాక్టరులో గడ్డి ధర రూ.2500 నుంచి రూ. 3000 వరకు పలుకుతున్నాయి. కొనే స్తోమత లేని కొందరు పోషకులు తమ పశువులను అమ్ముకుంటున్నారు.

రెండు గేదెలు అమ్ముకున్నా



ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ నిలుస్తుండటంతో మూగజీవాలకు మేత దొరకడం లేదు. నాకున్న రెండు గేదెలు అమ్ముకున్నా. నా లెక్క ఎవరూ ఇబ్బంది ప డొద్దు. గడ్డి కొందామంటే ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం పశుసంపద పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– దేవన్న, రాయపూర్‌కాండ్లీ

పోషకులను ఆదుకోవాలి



బ్యాక్ వాటర్ లేకుంటే పశువులకు మేత పుష్కలంగా దొరుకుతుంది. ప్రస్తుతం నీరు నిలువడంతో పశువులకు గడ్డి దొరుకతలేదు. అమ్మేందుకు ధైర్యం రావడం లేదు. ప్రభుత్వం గడ్డి విత్తనాలను పూర్తి రాయితీపై అందించి పోషకులను ఆదుకోవాలి.

– గటంజాయి రమేశ్, మొహళ

50శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు

పశుపోషకుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి పోషకులకు యాభై శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు మంజూరు చేస్తున్నాం. విత్తనాలు కావాల్సిన వారు ఆయా మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సంప్రదించాలి. – శంకర్, జిల్లా పశువైద్యాధికారి

ఆలయాల్లో భక్తుల సందడి



గండిరామన్న ఆలయం ఫౌంటేన్ వద్ద భక్తుల సెల్ఫీ



కుంటాల: గజ్జలమ్మ ఆలయంలో



కన్నపూర్‌లో గ్రామస్తుల ఊరేగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గండిరామన్న సాయిబాబా ఆలయం, హరిహర క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గండిరామన్న ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్ వద్ద సెల్ఫీలు దిగుతూ ఆహ్లాదంగా గడిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు గండి రామన్న ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు

కుంటాల : మండలంలోని కల్లూర్ సాయిబాబా, కుంటాల గజ్జలమ్మ, అందకూర్ లక్ష్మీ నర్సింహస్వామి, ఓల శివాలయం, సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామదేవతలకు పూజలు

లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్ గ్రామంలో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీ ఆలయ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరవడంతో ప్రతిమలు తొలగించి ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సర్పంచ్ సాలాయి నరేశ్ తెలిపారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు



కుంటాలలో పూజలు చేస్తున్న స్వాములు

కుంటాల : కుంటాలకు చెందిన అయ్యప్ప స్వాములు సంతోష్, భూషణ్, ఒడ్నం ప్రశాంత్ ప్రవీణ్‌కుమార్, సాయన్న, డా.రమేష్, వడ్ల రాజు, సుభాష్ ఆదివారం శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. కాగా స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో పూజల అనంతరం స్వాములకు జక్కని గజేందర్ ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు కడార్ల హరిప్రసాద్, ఉదయ్‌కుమార్, సిర్కూర్ రాజేందర్, సంజీవ్, బాలాజీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో అయ్యప్ప స్వాములు 120 మంది ఇరుముడులు కట్టుకొని ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు వెళ్లారు. గురుస్వాములు పెంటాజీ, అనిల్, సంజు, నర్సప్ప తదితరులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న రామారావ్ పటేల్

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన రాజేశ్వర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ నాయకులు రామారావ్ పటేల్ పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు వి.నగేష్, కానోబా, పోశెట్టి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



బీర్నందిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్, కొలాంగూడ గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా మున్నూరుకాపు, యాదవసంఘం భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం దళితవాడల్లో పర్యటించి దళిత బంధు పథకంపై అవగాహన కల్పించారు. మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని.. నేరుగా లబ్ధిదారులకే దళితబంధు సాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రంగపేట ఆలయ పూజారి శంకరయ్యను పరామర్శించారు. మోహిద్, వాల్‌సింగ్, గోపాల్, గంగామణి, లక్ష్మణ్‌రావు, రాజేందర్, సత్యనారాయణరెడ్డి, రాజగంగన్న, నవీన్‌యాదవ్, భూమేశ్, వెంకటేశ్, రవీందర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే రేఖానాయక్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్ దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ రాజేందర్, కలీల్, సంతోష్, కిషోర్, ప్రదీప్, రాజగంగన్న, కేహెచ్ ఖాన్, మల్లేశ్, నాగేశ్, తదితరులు ఉన్నారు.

ఐడియా అదిరింది



లక్ష్మణచాంద: వరినాట్ల సమయంలో కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై వెళ్లడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రహదారులు దెబ్బతినేవి. దీనికి తోడు ట్రాక్టర్ యజమానులకు పోలీసులు జరిమానాలు విధించేవారు. కాని ప్రస్తుతం లక్ష్మణచాందలోని ట్రాక్టర్ యజమానులు కేజీవీల్స్ ట్రాక్టర్లను పొలాల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ట్రాలీలను తయారు చేయించి అందులోనే తరలిస్తున్నారు.

‘చలో ఖానాపూర్’ జయప్రదం చేయాలి

ఖానాపూర్: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం పట్టణంలో నిర్వహించ తలపెట్టిన చలో ఖానాపూర్ సదస్సును జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని పంటలకు సరిపడ యాసంగి సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా పోడురైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సదర్మాట్ కాలువ పనులను నాసిరకంగా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కాలువకు మరమ్మతులు చేపట్టేలా దృష్టి సారించాలని కోరారు. వెంకటనారాయణ, గోపినర్సయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నిజాం విముక్త అమృతోత్సవాలు

సారంగపూర్: మండల కేంద్రంలో ఆదివారం నిజాం విముక్త అమృతోత్సవాలను కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ మండలాధ్యక్షుడు భీమలింగం ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికీ వెళ్లి నిజాం, రజాకర్ల హయాంలో జరిగిన దాడులు, హింసకాండ, సంస్కృతి అణిచివేతను వివరించారు. అనంతరం అమృతోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి కుర్ర నవీన్‌కుమార్, సభ్యులు రేకులపల్లి విఠల్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలో నిజాం విముక్త స్వాతంత్ర అమృతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మండల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరుగుతూ నిజాం చేసిన అన్యాయాలను వివరించారు. ఉత్సక కమిటీ సభ్యులు రాజశేఖర్, పోతరాజు, లక్ష్మణ్, రవీంద్రచారి, రాజు, కిషన్, శ్రీధర్, నగేశ్, వినాయక్, భరత్‌గౌడ్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చిమొక్కలు తొలగించరూ



లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలో రజకుల కోసం నిర్మించిన ధోబీఘాట్ చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోయాయి. దీంతో ధోబీఘాట్ వద్ద బట్టలు ఉతికేందుకు రజకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ధోబీఘాట్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించాలని రజకులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: దేవేందర్‌రెడ్డి, లోకేశ్వరం ఎంపీడీవో, ఫోన్: 9440829155

ఎనిమిది మందిపై కేసు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా శౌర్యదివస్



పూలమాల వేస్తున్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలో బహుజన ఐక్యవేదిక, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శౌర్యదివస్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమా కోరేగావ్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


పెంబి: మండల కేంద్రంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గోధురి బద్దయ్య ఆధ్వర్యంలో శౌర్యదివస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆత్మగౌరవం కోసం పోరాడి అమరులైన వీరులను స్మరించుకోవడం మన హక్కన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు ఉన్నారు.

రైతు బజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : అవతార్
వెంకటేష్ : టాప్ గేర్

ప్రధాన కూడళ్లలో పోలీసుల తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో డిసెంబర్ 31 నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల వరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని శివాజీచౌక్, జయశంకర్ సర్కిల్, బస్టాండ్, అంబేద్కర్‌చౌక్, బైల్‌బజార్ ప్రాంతాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఇందులో ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, సిబ్బంది, స్పెషల్ ఫోర్స్ పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. వాహనపత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించారు.

ఉత్సాహంగా న్యూఇయర్ వేడుకలు



ఖానాపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళలు



వద్యాల్‌లో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

భైంసాటౌన్: పట్టణంలో పలువురు న్యూయర్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ఖానాపూర్: పట్టణంలోని సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో ఎల్లాపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఉమారాణి, సుజాత, ఆర్.విజయలక్ష్మి, అరుణ, శైలజ, సునీత, శ్రీలత, సుజాత, సాయివెంకట లక్ష్మి తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద, చింతల్‌చాంద, కనకాపూర్, వడ్యాల్, బాబాపూర్, పీచర, మునిపెల్లి, పొట్టపెల్లి తదితర గ్రామాల్లో న్యూయర్ వేడుకలు నిర్వహించారు. కనకాపూర్ దుర్గామాత ఆలయం, లక్ష్మణచాందలోని వేణుగోపాలస్వామి, చామన్‌పెల్లిలోని రామాలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.